ఉపాధ్యాయసమితి

సీతాదేవి

ఉమాపతి మాస్టారికి బ్రహ్మాండమైన ఆలోచన లున్నాయి. ఈనాటి ఉపాధ్యాయుడిస్థితి చూస్తే ఆయనకి గుండె తరుక్కుపోతోంది. "ఏమిటి అన్యాయం?" అని ఆలోచించాడు. ప్రభుత్వమే కాదు, దేశమే గొడ్డుపోతుంది ఉపాధ్యాయుడు లేకపోతే! అలాంటి ఉత్తమమైన పనిముట్టు తుడుపులేక తుప్పుపట్టిపడుంది! దానికి ఆలనా, పాలనా లేదు. తల్లితండ్రీలేని పాపలాంటివాడు ఉపాధ్యాయుడు. ఏశాఖ అయినా, ఎంత ఉత్తమమయిన శాఖ అయినా...ఏసిబ్బందీఅయినా ఉపాధ్యాయుడు తయారుచేసి వదిలిన వస్తువు. ముడివస్తువును అనుభవించేదిగా తయారుచేసే కార్మికుడికి తిండిలేదు! హరహరా! ఇదేమి వింత! ఉపాధ్యాయ వృత్తి అంటే అణువు మొదలు బ్రహ్మాండంవరకూ లోకువేనా!

సోదర ఉపాధ్యాయులతో ఈ విషయమే చెప్పాడు. "మనకు అన్యాయం జరుగుతోంటే వెర్రినాగమ్మల్లా చూస్తూ ఊరుకున్నాం. ప్రపంచంఅంతా ముందుకు సాగిపోతున్నది. మనం మందంగా వెనకబడి ఊరుకోవడానికి వీల్లేదు. మనది బ్రహ్మాండమైన సంస్థ. మనకి కావలసినంత బలగముంది" "అవును! అవును!" అని అంతా అన్నారు.

ఇంకా అన్నారు ఉమాపతిమాస్టారు వళ్లు జలదరించేమాటలు. "అమ్మ పెట్టకపోతే అమ్మచేత మనమే పెట్టించుకు తినాలి!"

"అలాగే మరి!" అని దాసుమేస్టారు అన్నారు.

"ప్రతీసంస్థకు ఒక సంఘంలాంటిది ఉంటేది, సంఘ బలమును కూర్చి వేరే ముచ్చటించక్కర్లేదు. సంఘంద్వారా మన కోర్కెలను మనం సాధింకోగలం. ప్రస్తుతం మనం సుసంఘటితమైన ఒక సంఘం ఏర్పరచుకో



మెరుపు తీగకు వెలుగు పూవులు

ఫొటో: వి. కేశవశర్మ

★ ఉపాధ్యాయ సమితి ★

కారు!"

"అలాగే కానీయండి!" అన్నారు నాగభూషణంగారు.

శివమూర్తి కస్సుమన్నాడు, "మనలో ఉన్నది అదే. ఎవడో కానిస్తే చూస్తూ ఊరుకొంటాం. పోస్టల్ డిపార్టుమెంట్ పెద్ద భారీ ఎత్తున సమ్మె సాగిస్తుంటే మనం చూస్తూ ఊరుకున్నాం. మనకు కనువిప్పు కలుగలేదు. దానికి బలవత్తరమైన సంఘం ఉంది అనుకొన్నాం. అంతేగాని మనంమాత్రం ఎందుకు మన కోరికలను నెరవేర్చుకోరాదూ అనే ప్రశ్న కలగలేదు, వాళ్ళు చేస్తున్నారనే ఏడుపు తప్పితే" శివమూర్తిగారు కోపంతో కళ్ళజోడు తీసి, అటూ ఇటూ చూసి అన్నారు. నాగభూషణంగారుకూడా ఏమంత తక్కువవారు కాదు. ఆయన, శివమూర్తి వదిలిన 'చేంతాడు'ను గభాలున అంది పుచ్చుకున్నట్టు..."అక్కడే వస్తుంది నాకు తలనొప్పి వాళ్ళు చేస్తున్నారనే ఏడుపు మాకెప్పుడూ లేదు. కాని వాళ్ళు చేస్తున్నది అన్యాయం అనిమాత్రం అనగలను" సభవంక ఒకమారు కలియచూసారు. సభ చూపులు... "ఇంకా పొడిగించు. బాగుంది" అన్నట్లున్నాయి.

"ఈ విషయంలో నేను ప్రభుత్వంతో ఏకీభవిస్తున్నాను. వాళ్ళకి ముట్టే జీతాలకు మన జీతాలకు సాపత్యం ఉందా? వెధవది... మనముందుపుట్టి పెరిగిన, వాడెవడూ?... తాడి సుబ్రహ్మణ్యం...పోస్టాఫీసులో గుమాస్తాఅయ్యాడు. మన్ని మించిపోయాడు. నిన్నకాక మొన్న స్కూలుఫయినల్ ప్యాసయిన వాడు నూరు నూటపది తెస్తుంటే...పదేళ్ళ సర్వీసు ఉన్నా, స్కూలుఫయినల్ చదివి, రెండేళ్ళ ట్రయినింగయినా ఎనభై దాటరు, ఏమిటీ అన్యాయం అంటాను. వాళ్ళు కీలకశాఖలో ఉన్నారని...ప్రతీ విషయానికీ ప్రభుత్వాన్ని బెదరించే!" అని మరోమాటు సభను చూచి నాగభూషణంగారు కూర్చున్నారు.

శివమూర్తి తిరగతోడాడు విషయాన్ని. "నాగభూషణంగారు చెప్పిందాంట్లో సత్యముంది. వాళ్ళ జీతాలకు, మన జీతాలకు ఎంతో తేడా ఉంది. ఒప్పుకుంటాను, 'వాళ్లు తీసుకొనే బాధ్యత, మనబాధ్యత దృక్పథంలో పెట్టుకోరేం? అది మన కక్కర్లేదనుకుంటాను."

వెంటనే కృష్ణమూర్తిగారు "బాధ్యతకే అంత తేడా చూపడం-కొంచెం కష్టంగానే ఉంటుంది సుమండీ! అయితే "బాధ్యత తప్పితే, పనిని దృష్టిలో ఉంచుకోరులా ఉంది శివమూర్తిగారు. "సభ ఫకాలుమంది. కృష్ణమూర్తికి ఎంతో ఉత్సాహము వచ్చింది. ఒక 'బక్క' జోకును కూడా విసిరారాయన.

"మన ఉపాధ్యాయుడు వందేళ్లు బతికేది ఏభై ఏళ్ళకంటె ఎక్కువ బతికి చావడు. అందుకే కాబోసు, దీనికి ప్రమోషనులాంటిది లేదు." సభ మరోమాటు గొల్లుమంది. శివమూర్తి తాను క్రిందకు త్రోసి వేయబడుతున్నట్లు గమనించి వెంటనే అందుకొన్నాడు.

"నేను పోస్టల్‌వాళ్ళు చేయబోయిన సమ్మెను సమర్థించడానికి ఇక్కడకు రాలేదు. వాళ్లు చేయగలుగుతున్నారు అంటే వాళ్లకి బలం ఉంది. మనం చేయలేం. మనం చేయలేనిది వాళ్లు చేస్తున్నారని మనకు దుగ్ధ"

"నాకు అక్కడే వస్తుంది." అని ఇంకా ఏదో చెప్పబోయాడు నాగభూషణం.

"మీకు ఎక్కడున్నా వస్తుంది. అక్కడే కాదు. కూర్చోండి..." అనబోయాడు శివమూర్తి. సభ మరోమాటు గొల్లుమంది. నాగభూషణం అభిమానపడ్డాడు. వెంటనే... "శివమూర్తిగారూ! మీకు ఔచితి...అనౌచితికూడా తెలియదు."

విషయం చాలా దూరం పోతున్నట్టు ఉమాపతి గ్రహించి "అయ్యలారా! మనలో మనం ఇలా కీచులాడుకోవడం తగదు. మనకు అనేక సమస్యలున్నాయి. వాటిని సంఘీభావంతో ఎదుర్కోవాలి. మనం ఒకందుకు వచ్చాం. అది మర్చిపోయి...వేరొక విషయాన్ని స్పృశించాం దురదృష్టవశాత్తూ!"

"అలాగే మరి!" అన్నారు. ఆగ్నేయవర్మగారు.

"అలాగే కాదు. రెండు ముక్కలు చెప్పండి" అన్నాడు డ్రిల్లు మాష్టారు సదానందం.

"ఇదేం డ్రిల్లు కాదు!" అన్నారు ఆగ్నేయవర్మగారు.

"లెక్కలూ కాదు. 'హోమ్ వర్కు'లో 'స్కూలు వర్కు' చెల్లు!!" అన్నాడు సదానందం. బక్కచిక్కిన లాల్చీలు కిసకిసమన్నాయి!

హిమబిందుగారు లేచారు. ఆయనకాస్త భావకవి.

"చూశారా! మన సోదరోపాధ్యాయులలో ఉన్న మొదటి లోపం ఇది. ఒకరంటె ఒకరికి పడదు. ఒకరి మాటపై మరొకరికి హితవు ఉండదు. వీరందరికీ ఐకమత్యం కుదరాలి. అది కుదిరితే, అడవిలోని కాయ, సముద్రపు ఉప్పు కలిపిన ఆవకాయవలె పసందుగా ఉంటుంది." అని కూర్చొన్నారు.

వేదమూర్తిగారు మాట్లాడబోయారు. ఆయన రాజకీయ బాధితుడు. జైలుకు వెళ్ళాడు. లాఠీదెబ్బలు తిన్నాడు. అవి ఆయన "క్వాలిఫికేషన్సు". ఐదెకరాలు పుచ్చుకున్నాడు. ఉపాధ్యాయవృత్తి. ఏదో 'కాలక్షేపం'గా చేస్తున్నారు. ఆయన అన్నారు గద్గదస్వరంతో...

"సోదరులారా! మనం సమావేశం అవడానికి, శ్రీ ఉమాపతిగారు మన్నిక్కడికి రప్పించడానికి గల కారణాలు మనకు తెలుసు. మన కోర్కెలు కనీసమైనవి. న్యాయసమ్మతమైనవి. ఇది మనకే కాదు, ప్రభుత్వానికీ తెలుసు. మన చేతివేళ్ళు ఐదింటిలోనూ, దేనికి ముల్లు గుచ్చుకున్నా మనం బాధపడతాం. అలానే ప్రభుత్వం కూడా, ఏశాఖలోనివారు బాధపడుతున్నా క్షోభిస్తుంది. అసలే మన ప్రభుత్వం ఆర్థికంగా వెనకబడుంది. ఏతండ్రి తన పిల్లలకు మంచి ఆహారం, మంచి గుడ్డ, మంచి విద్య ఇప్పించాలని చూడడు? తల్లికి బలహీనుడైన కుమారుడిపై ఎక్కువ ప్రేమ ఉంటుంది. అలాగే ప్రభుత్వానికి ఉపాధ్యాయసమితిపై ఎంతో ప్రేమవుంది. ఆర్థికపుష్టి రాగానే ప్రభుత్వం తగినంతసహాయం ఉపాధ్యాయుడికి చేస్తుందనే దృఢవిశ్వాసం నాకుంది. పోతే, ఆర్థికంగా వెనకాడుతున్న ప్రభుత్వానికి, మనకోసం బాధపడుతున్న ప్రభుత్వానికి, మనకై బెంగపెట్టుకొని, గాయపరుచుకొన్న ప్రభుత్వానికి, మనం సమ్మెలు మొదలయినవిచేసి మరికొంత బాధను కలగజేయడం ధర్మమేనా? పైగా అందరి ఉద్యోగాల్లాంటి ఉద్యోగము కాదు మనది. అత్యుత్తమమయినశాఖ మనది. క్షమకు మనం పెట్టింది పేరు. భావిభారతనిర్మాతలయిన మన బాలబాలికల రూపురేఖలు దిద్దే మనమే సమ్మెలు చేసి విప్లవాత్మకముగా తయారైతే, ఇక విద్యార్థులు ఎలా తయారవుతారో యోచించండి. ప్రభుత్వం ఉప్పు తింటూ, ప్రభుత్వానికే ఎసరుపెట్టే యీ చెడుబుద్ధి మనకు ఎక్కడనుంచి సంక్రమించిందని విచారించాలె! బుద్ధదేవుడు పుట్టిన దేశం మనది. మన జాతిపిత బాపుజీ! మన ఔన్నత్యాన్ని ఖండాంతరాలలో చాటే నెహ్రూను దృష్టిలో పెట్టుకొని మనం ఏ పనినైనా తలపెట్టాలె!" అని కూర్చున్నారు.

రాజలింగం వెంటనే నుంచొని "శ్రీ వేదమూర్తిగారు చెప్పినమాటలువింటే, నేనిక్కడున్నానా అనే అనుమానం నన్ను ఇంకా వదల్లేదు. ఆయన మాటల్లో ఎంతో సత్యం వుంది. కాని ఒకటి. ప్రతి ఉపాధ్యాయుడూ, శ్రీ వేదమూర్తిగారిలా ఎల్లాగో అల్లాగ రాజకీయ బాధితుడై,

ఏదో కాస్తో కూస్తో, సంపాదించితే, అచ్చు వేదమూర్తిగారిలా మాట్లాడగలరనే విశ్వాసం నాకుంది!" అని కూర్చున్నారు. సభ గలగలమంటూ నవ్వుతూ మెలికలు తిరిగిపోయింది. వేదమూర్తి "ఖద్దరు జేబురుమాలు"తో మొహంతుడుచుకున్నారు.

దాసు మాస్టారు లేచినుంచున్నారు. సభ నిశ్శబ్దంగా ఉంది. "మనం వాదోపవాదాలాడుకోవడానికే అయితే దానికి ఒక ప్రత్యేక సభ ఏర్పరచవలసిన అవసరం శ్రీ ఉమాపతి మాస్టారికి ఉండదు. ఏమైనా నేను రెండుముక్కలు అనుకుంటున్నాను. అవి మనవిచేస్తున్నాను. మనం విధికివశులం. గిలగిలా తన్నుకున్నా బయటపడేది సున్న. ఈ జీవిత నాటకరంగంపై మనకు పాత్ర నిర్దేశింపబడింది. దాన్ని ఆడితీరాలి. ఆడతాం. మనం వేరేత్రోవ త్రొక్కుదామన్నా మన తాపత్రయమే మిగులుతుంది. అంతే! జరిగేది జరిగితీరుతుంది. మన సమస్యలు ప్రకృతికి వదిలేయండి. రోజులు దొర్లుతోంటే అవే పరిష్కరింపబడతాయి."

రాజలింగం లేచాడు. "ప్రతీవార్ని ఖండించడానికే లేస్తున్నా ననుకుంటారు. అది యథార్థంకాదు. యథార్థం మాట్లాడితే అది ఖండనలా ఉంటుంది. నేను ఎవర్నీ ద్వేషించను.

ఇప్పుడు దాసుమేస్టారు చెప్పేది నిజం కావచ్చు. నిజం కాకపోవచ్చు. అది తేల్చి చెప్పే సాహసం నాకులేదు. కాని ఒకటి నిజం. మనవాళ్ళు అంటారు నాలుగు వేళ్ళూ నోట్లోకిపోతే వేదాంతం బాగా అలవడుతుందని. దాసుమాస్టారికి అదృష్టం మీద అభిమానం ఉండడం సహజం. ఆయన ఏనాడూ ఊహించి ఉండడు తనకంత అదృష్టం పడుతుందని. అందుకే ఆయనకు ప్రకృతిపైన, కాలంమీద నమ్మిక! ఆయన దత్తుడు! బాగా డబ్బుంది. డబ్బులేకపోవడమంటే ఆయనకు ఆశ్చర్యంగా ఉంటుంది. పెధవది! దానికోసం సమ్మెలా అని కూడా అనిపిస్తుంది. నేను చెప్పేది ఏమీలేదు. చెప్పలేను కూడా! కాని ఇతరులుచెప్పేదానిపై మాట్లాడగలను. అంతే! కాలాతీతం అయిపోయింది. ఉమాపతిగారే నాల్గుముక్కలు చెపితేమంచిది." అని కూర్చున్నారు.

ఉమాపతి మాస్టారు చెప్పడం మొదలుపెట్టారు. "కాలాతీతం అయింది. ఇప్పుడు మన సోదరులు చెప్పినదంతా పొల్లుక్రింద, కాలహరణంక్రింద నేను జమకట్టను. అందులో ఎంతో అర్థం పొదగబడిఉంది. ఇలాంటి అమూల్యమయిన విషయాలు గ్రహించగలిగిన అవకాశం కలిగినందుకు నేను సంతోషిస్తున్నాను. పదిమందీ పదిరకాలుగానూ చెప్పారు. ఇవన్నీ కలగాపులగంగా వున్నాయి. వీటినన్నీ ఏర్చి కూర్చాలి. మనం ఏంచేయాలో మనకు తోచకుండావుంది. ఇంతటితో నేటి సమావేశం ముగించేస్తే మంచిదనుకుంటాను. మనం ఒక నిర్ధారణకు వస్తేనేగాని ప్రధానోపాధ్యాయులను కలుసుకోనడం అవసరంకాదని నేనుఅనుకుంటాను. మన నిర్ణయం మనం చేసుకోవడం కష్టంగా వున్నట్లుంది. దానికై ఒకరిసలహా తీసుకోడం అవసరంగా భావిస్తున్నాను."

"అవును" అన్నారు అంతాఏకగ్రీవంగా!

"అయితే ఎవరిసలహా అన్నది ప్రశ్న వస్తుంది. వయుస్సు ముళ్ళినవారు, లోకానుభవం కలిగినవారు, అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయపదవి నలంకరించి'రిటయిరయి'న



హారిచక్రం!
ఫొటో: శ్రీపాద వెంకన్న.

వారు బసవపున్నయ్యగారున్నారు. ఆయన మీద మీకూ, నాకూ కూడా గౌరవమున్నది. మనం చేసే నిర్ణయాలు కొంత ఆవేశపూరితంగా వుండొచ్చు. ఎందుచేతనంటే మనం దురవస్థలో వున్నాంగనక. బురదలో పడినవాడికి బయటపడ్డం ఎలాగో తోచదు. గట్టుమీదున్నవాడు సలహా, సునాయాసంగా చెప్పగలడు. ఆయనను రప్పించడం అందరికీ సమ్మతమే అనుకుంటాను."

"సమ్మతమే" అన్నారంతా!

ఆయనను కలుసుకున్న తర్వాత సమావేశమవవలసిన తేదీ తెలియచేస్తాను. మన కోర్కెలు తీర్చవలసినదిగా, మనసంఘం సుసంఘటితమైనదై ఉండవలసినదిగా, ఆతేజోవంతమైన తేజాన్ని ప్రార్థిస్తూ ఇంతటితో నేటి సమావేశం పూర్తయిందని తెలియజేస్తున్నాను."

ఎవరిఇళ్ళకు వాళ్లువెళ్ళిపోయారు రొదగా!

మరి రెండురోజులకు బసవపున్నయ్యగారి అధ్యక్షతను సభ జరిగింది. ఆయన ఇలా అన్నారు: "అయ్యలారా! మీరు నామీద ఇంత ఆదరణచూపడం నిజంగా నేను గర్వించదగదే. నేనూ ఉపాధ్యాయుడనే. ముప్ఫది ఏళ్ళపైన ఉపాధ్యాయుడుగా పనిచేశాను. ఉపాధ్యాయుడి కష్టసుఖా లేమిటో నాకు పూర్తిగా తెలుసు. మీరు ఇప్పుడు తీర్చుకోబోయే సమస్యలు ఏమీ కొత్తవికావు. ఇవి ఎప్పటినుంచో అలాగే పడివున్నాయి. మనకు అంగబలం కావలసినంతవుంది. ఇంత సిబ్బంది ఏశాఖలోనూ వుండదు. ఇది అత్యుత్తమమైన శాఖఅని అందరూ చెపుతారు నిజమే. కాని అన్నిశాఖల 'చైను' లోనూ ఇది అతిబలహీనమైన 'లింకు'. దీనికి గట్టితనం కలిగించాలని కలిగినభావన నిజంగా సంతోషించతగ్గదే.

మీకు క్రియాత్మకమైన ప్రోత్సాహం లభించకపోయినా ప్రజాదరణ, జాలి వుంటాయి. మీకోర్కెలు అతి కనీసమైనవని, మీరు కోరేవి, సామాన్యులు కోరే అతి ముఖ్యావసరాలని, అందరూ ఒప్పుకుంటారు. కాని ఉపయోగాత్మకమైన పనిగాని, ప్రోత్సాహంగాని, బయటనుంచి లభించదన్నమాటమాత్రం వాస్తవం.

అయితే మీకు మీరే చూసుకోవాలన్న మాట. ఇది ఒకటి రెండు స్కూళ్ళ ఒప్పందంతో జరిగేదికాదు. సంఘీభావం కావాలి. అన్నిచోట్ల పంతుళ్ళందరూ కలియాలి. అప్పుడుమాత్రంసంభవమా అంటే....అప్పుడు కూడా సంభవం కాకపోవచ్చు.

మనం ఒకనిర్ణయానికి వచ్చేముందు, దాని పూర్వాపరాలు కూడా యోచించాలి. చెప్పానుగా ... విద్యాశాఖ అన్నిశాఖల్లో అతి బలహీనమైనశాఖ. ఉపాధ్యాయులంతా సమైక్యమై సమ్మెలాంటిది తలపెడితే, (అటువంటిది జరుగకుండుగాక!) అది జయప్రదం అవుతుందనే నమ్మిక నాకు లేదు. ఇదేమీ, రైల్వే, తపాలాశాఖలవంటి శాఖ కాదు. పంతుళ్లు సమకట్టి, అంతా, సమ్మె కట్టినవాడు, అటు ప్రభుత్వంగాని, ఇటు ప్రజగాని నష్టపోయేది పీసమెత్తు ఉండదు. కొంతకాలం సమ్మె నిరాఘాటంగాజరగాలి. అది జరగడం అసంభవం. మీకు శక్తిలేదు.

అదికూడా జరుగుతుంది, జరిగితీరాలి, అని మీరంతా అంటె, మీ ఐకమత్యాన్ని, మీరు ఒకసారి పరీక్షించుకోండి" అని ఆయన కూర్చున్నారు.

ఉమాపతిగారు కలుగచేసుకొని ... "అయ్యా! మనం తలపెట్టిన కార్యం విప్లవాత్మకమైనదికాదు. అహింసాత్మకమైనది. మా ఐకమత్యంలో మాకు నమ్మకం ఉంది."

పున్నయ్యగారుచెప్పారు ... "మీ ఆవేశంలో కొండంతలు గోరంతలుగా కనపడుతున్నాయి. మీరు చేయబోయే మీ కోరికల

(56-వ పేజీ చూడండి)

పాతబంగళా

(26-వ పేజీ తరువాయి)

తనతల దూర్చాడు.

ఏభైగజాల దూరంలో ఒక అగ్గిపుల్ల వెలిగింది. అస్పష్టమైన మానవాకృతి కనబడింది. అది వారి దిక్కే నడుస్తూ వస్తూండటం రాజారావు బాగా గమనించాడు. కఱ్ఱ చప్పుడుకూడ వినవస్తోంది. రాజారావు గుండె వేగం ఎక్కువవుతోంది.

“దయ్యం......” అస్పష్టంగా అనబోయాడు. సారంగధర్ మాట పైకిరాకుండా నోరు నొక్కేశాడు.

చప్పుడధికమయింది. చుట్టనిప్పు అగుపడుతోంది. మధ్య మధ్య నిప్పు క్రిందకుదిగడం, పైకి వెళ్ళి తిరిగి ప్రకాశించడం జరుగుతుంది. అదీ మనిషిలా నోటికి చేతికి తీసుకుంటుందికాబోలును—అనుకున్నాడు రాజారావు.

—ఖాండ్రించి వుమిసిన శబ్దం.

“అబ్బా!—మనిషి మల్లేనే—?” కుతూహలం పట్టలేకపోయాడు రాజారావు. గట్టిగా నోరునొక్కాడు సారంగధర్.

ఆ ఆకృతి మెల్లగా బంగళావైపువచ్చింది. నోటినున్న ఆ చుట్టను క్రిందవేసి కాలితో మట్టివేసింది భూతం—

జేబులోంచి ఫైవ్ సెల్సు టార్చిలైట్ తీశాడు సారంగధరు—

సరిగ్గా టైం—మూడూనలభై చూపుతోంది వాచీ—

‘టార్చి వేస్తే ఆ ఆకృతిమీదకు’—అనుకున్నాడు సారంగధర్—

దూరంగా ఏదో వెలుగు కనబడింది—హరికేన్‌లాంతరు. తన ప్రయత్నాన్ని విరమించుకొని అటు చూస్తున్నాడు. అది దగ్గరవుతున్నది—

అరుగుమీదున్న ఆకృతి, క్రిందకుదిగింది. అగ్గిపుల్ల వెల్గించి ఆ లాంతరువైపు చూస్తున్నది.

“దాని చేయి మనిషిలా నేవుంది—ముఖం కనబడడం లేదు. ముఖమంతా వెంట్రుకలమయంలాగుందే”—కంపించిపోయాడు రాజారావు.

ఆ లాంతరు వెలుగు చాల దగ్గరయింది. రెండు మూడు అడుగుల చప్పుడు పసికట్టాడు సారంగధర్.

ఊపిరి పీల్చే ధ్వనికూడ ఆపివేశారిద్దరూ—దగ్గింది అరుగుమీదున్న ఆకృతి—

“ఉన్నారు—నువ్వుండు”—

నిశ్శబ్దాన్ని చీల్చుకొని వచ్చాయీ మాటలు—, ఆ లాంతరు వెల్గు ప్రక్కనుండి—

చీకటిలో ఒకరిముఖా లొకరు చూచుకున్నారు సారంగధర్ రాజారావులు—

అచ్చం మనుష్యుల్లానే మాటలు—అనుకున్నారు.

“ఏం ఇంత ఆలస్యం?”—ప్రశ్నించింది.

గభాల్న లేచి నిలబడ్డారు రాజారావు సారంగధర్‌లు.

“టార్చి—వేయ్”—కుతూహలం పట్టలేక గట్టిగా అరిచాడు రాజారావు.

పెద్ద వెలుగు వెలిగింది—ఆ ఆకృతులపైన—నిర్ఘాంతపోయారు సారంగధర్ రాజారావులు—

కరణంగారమ్మాయి మునసబుగారబ్బాయి చేతుల్లో—

★

(19 వ పేజీ తరువాయి)

విజ్ఞప్తిపత్రాన్ని త్రోసిపుచ్చుతే?”

“సమ్మె!” వెనకనుంచి కీచు కంఠం అరిచింది. “సరే మంచిదే...సమ్మె అంటే మాటలుకాదు. అందులోనూ చేసేది ఉపాధ్యాయులు. మీరు సమ్మె కాదు కదా, నిరాహారదీక్షపూనినా, దేశం స్తంభించదు. పత్రికలు గగ్గోలు పెట్టవు. రైళ్లు ఆగిపోవు. పార్లమెంటు కలవరపడిపోదు. కోర్టులు ఆగవు. ఎటొచ్చీ ... హాహాకారాలుచేసేది మీరే...జీతాలులేక, తిండిలేని మీ పిల్లలు చేసేగోల భరించలేక”—

“అందుకు మేం సిద్ధంగా ఉన్నాం.” ఉమాపతిగారు నిశ్చయంగా అన్నారు. పున్నయ్యగారు పకపకమని నవ్వారు. ఆ నవ్వులోని ధ్వని, వ్యంగ్యం తర్వాతిగాని తెలిసిందికాదు ఉమాపతిగారికి.

“మీ కార్యదీక్షకు, మీ స్థైర్యానికి నేను సంతోషిస్తున్నాను. గర్విస్తున్నానుకూడా! మీ తక్షణకర్తవ్యం, మీ సంఘమును సుసంఘటితపరచుకోవడం.”

“ఏముందీ ... జిల్లా ఉపాధ్యాయులను సమావేశపరుస్తాం.” అన్నారు ఉమాపతిగారు.

“అలాగే చేయవచ్చు. ముందు, సమావేశపరచడానికి, మీ పాఠశాల ఉపాధ్యాయులంతా ఏకగ్రీవంగా తీర్మానం వ్రాయించండి. తర్వాత కార్యక్రమం చూసుకోవచ్చు.”

“అదెందుకు?” ఉమాపతిగారి కర్థంకాలేదు.

“మీకు తెలియదు తీర్మానం అవసరం కలవు.” అని వెళ్ళిపోయారు.

మర్నాడు ఉదయం, జిల్లా ఉపాధ్యాయులను, తమ కష్టనిష్ఠురములను చర్చించుకొనుటకు, సమావేశపరచుటకు ఏకగ్రీవముగా తీర్మానించడమైనదని ఉమాపతి మొదలి సంతకంచేశారు.

ప్రప్రథమంగా రాజలింగాన్ని కలుసుకొన్నాడు. రాజలింగానికి కాగితంఇచ్చాడు. రాజలింగం, కాస్త చనువును ఆసరాచేసుకొని, ఉమాపతిని మందలించాడు.

“మొదటే నేనా? వెధవబోణీ...నేనే మయిపోతాను? అందరిచేతా కానియ్యి...” అని తప్పించుకొన్నాడు.

వెదమూర్తిగార్ని కలుసుకున్నాడు. “నేను ఆనాడే చెప్పాను. ప్రభుత్వం ఉప్పు తింటూ ప్రభుత్వానికి ఎదురు తిరగడమా? క్షమించండి. హిమబిందు “నన్ను ఈ ప్రాపంచికవిషయాలకు మళ్ళించకండి.”అన్నాడు. దాసు మేష్టారు వేదాంతం వినిపించారు. ఇలాగే అంతా తలొకవిధంగా చెప్పి, మొత్తంమీద, ఉమాపతిగారితో ఎవరూ సహకరించలేదు...పోతే...ఒక్క ఉమాపతిగారే...ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సంతకం పెట్టాడు!

బాధగా, బరువుగా పున్నయ్యగార్ని కలుసుకొన్నాడు. జరిగింది చెప్పాడు. బసవపున్నయ్యగారు గలగలమంటూ నవ్వారు. ఆ నవ్వు అర్థం ఇప్పుడు తెలిసింది ఉమాపతిగారికి. ఆయన అన్నారు...“చూశారా! మీ సుసంఘటితమైన సంఘ ఐకమత్యబలం! ఇలాగే ఉంటుంది. జరిగింది మరచిపోండి. ఎక్కడా చెప్పకోకండి. బాగుండదు.”

ఉమాపతిగారు తిరిగివచ్చేస్తూ ... “వెధవది...మేకలు,” అనుకొన్నాడు. ★



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad